సహకార రంగం బలోపేతం

- రూ.7.43 కోట్లతో సొసైటీల అభివృద్ధి
- పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మెరుగైన సేవలు
- సొసైటీలకు నూతన భవనాలు, గోడౌన్ల నిర్మాణం
- అదనపు ఆదాయం కోసం పెట్రోలు బంకుల ఏర్పాటు



నూతనంగా నిర్మించిన తుక్కులూరు సొసైటీ భవనం

నూజివీడు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయంతో పాటు సహకార రంగాన్ని బలోపేతం చేసింది. దీనిలో భాగంగా వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలను అందించింది. అన్ని సహకార సంఘాలను అభివృద్ధి చేస్తూ, బడ్జెట్‌లో నిధులు కేటాయించడమే కాకుండా సహకార సంఘాలకు సొంత భవనాలను నిర్మించారు. శిథిలమైన భవనాలను ఆధునికీకరించారు. వీటికి తోడు సహకార కేంద్ర బ్యాంకులను ఆధునికీకరించడంతో వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలందిస్తున్నాయి.

నూజివీడు నియోజకవర్గంలో...

నియోజకవర్గంలోని కేడీసీసీబీ బ్రాంచ్‌లకు నూతన భవనాలను, ఆధునికీకరణ పనులను, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)కు నూతన భవనాల నిర్మాణం, ఆధునికీకరణ పనులను కేడీసీసీబీ చైర్మన్‌లు, స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చొరవతో చేపట్టారు. నూజివీడు, చాట్రాయి, ఆగిరిపల్లిలలోని కేడీసీసీబీ భవనాలను రూ.2 కోట్లతో ఆధునికీకరించారు. చాట్రాయిలో కోటి రూపాయలతో నూతన భవనాన్ని నిర్మించారు. ఆగిరిపల్లిలో రూ.16.75 లక్షలతో ఏటీఎం ఏర్పాటు, ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. నూజివీడులో రూ.20.50 లక్షలతో ఆధునికీకరణ పనులు చేశారు. రూ.6.08 కోట్లతో నియోజకవర్గంలోని పలు సొసైటీలకు నూతన భవనాలను నిర్మించడం, పెట్రోలు బంకులను ఏర్పాటు చేయడం, గోడౌన్‌లను నిర్మించి రైతులకు మెరుగైన సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు. చాట్రాయి మండలంలోని చిన్నంపేట, తుమ్మగూడెం, పోలవరంలలో ఒక్కొక్కటి కోటి రూపాయల వ్యయంతో పెట్రోలు బంకులను ఏర్పాటు చేశారు. నూజివీడు మండలం తుక్కులూరులో రూ.43లక్షలతో నూతన సొసైటీ భవనాన్ని నిర్మించి దానిలో క్యాష్ కౌంటర్, లాకర్‌లను సైతం ఏర్పాటు చేశారు. నూజివీడులో సైతం రూ.70 లక్షలతో సొసైటీ నూతన భవనాన్ని నిర్మించారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో రూ.40.50 లక్షలతో సొసైటీకి నూతన కార్యాలయాన్ని, నూతన గోడౌన్‌ను నిర్మించారు.

నియోజకవర్గంలో ఈదులగూడెం, తుమ్మగూడెం, పోలవరం, చిన్నంపేట, చనుబండ, రమణక్కపేట, చెక్కపల్లి, గోపవరం, కాట్రేనిపాడులలోని సొసైటీలకు నూతన భవనాలను నిర్మించడం, ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. నూతన భవనాలను నిర్మించిన సొసైటీల్లో క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, లాకర్లు ఏర్పాటు చేయడంతో పాటు గోల్డ్‌లోన్ సౌకర్యాన్ని కల్పించి సంఘాల వ్యాపార అభివృద్ధికి తోడ్పాటును అందించారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారమవడంతో సహకార సంఘాల అధ్యక్షులతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సహకార సంఘాల అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహకార సంఘాలు అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో రూ.7.43 కోట్లతో నూతన సొసైటీ భవనాలు, గోడౌన్‌లను నిర్మించడంతో పాటు ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఒక్కో రైతుకు అర్హతను బట్టి రూ.8లక్షల నుంచి రూ.40 లక్షల వరకు రుణాన్ని ఇస్తున్నారు.

– పల్లి రవీంద్రరెడ్డి, రైతు, నూజివీడు

రైతులకు గోడౌన్ల సదుపాయం

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ గోడౌన్‌లను అడవినెక్కలం, ఈదులగూడెం, చిన్నంపేట, చనుబండ, రమణక్కపేట సొసైటీల వద్ద నిర్మించారు. దీనివల్ల వర్షాల సమయంలోనూ, తుపానుల సమయంలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి ఈ గోడౌన్‌లు దోహదపడనున్నాయి. సొసైటీల ద్వారా ఎరువులను విక్రయించేందుకు సైతం గోడౌన్‌లు ఉపయోగపడతాయి. పోలవరం, తుమ్మగూడెంలలో మీటింగ్‌హాల్‌లను సైతం నిర్మించారు. ఈ విధంగా అన్ని రకాల సదుపాయాలను గత రెండేళ్లలో అందుబాటులోకి తేవడంతో ఇవి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

క్లుప్తంగా

గుడి ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల



రెడ్డిగూడెం: మండలంలోని కుదప గ్రామంలో రాములవారి గుడి, శ్రీకృష్ణుని గుడి ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలి



నూజివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టిందని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) ప్రజలను కోరారు. పట్టణంలోని 30వ వార్డులో సోమవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని వివరిస్తూ ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, కౌన్సిలర్లు నడకుదురు గిరీష్, నాయకులు మేకల అనిల్, తవిడిశెట్టి అశోక్, బసవా వినయ్, షేక్ మున్నీ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తం



మైలవరం: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. మైలవరం తహసీల్దారు కార్యాలయం, అనంతరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పలు బృందాలతో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ సార్వత్రిక ఎన్నికలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 26న నామినేషన్‌ల పరిశీలన, 27 నుంచి 29 వరకు ఉపసంహరణలకు గడువు ఉంటుందని తెలియజేశారు. నామినేషన్‌లు దాఖలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలు, సలహాలు, సూచనలను వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తమ విధుల్లో అలసత్వం వహిస్తే ఎన్నికల నియమావళిని అనుసరించి క్రమశిక్షణ చర్య తీసుకుంటామన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ విధిగా పోస్టల్ బ్యాలట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ గురించి అధికారులకు పలు సూచనలిచ్చారు. సమావేశంలో మైలవరం ఏసీపీ మురళీమోహన్, తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, నియోజకవర్గ ఏఆర్‌ఓలు, ఎంపీడీఓలు, ఎంసీసీ టీమ్‌లు, ఏఈఓలు, సెక్టార్ ఆఫీసర్‌లు, సెక్టార్ పోలీస్ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రతాప్ ఎన్నికల ప్రచారం

నూజివీడు: మండలంలోని మొర్సపూడి, గొల్లపల్లిలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ సోమవారం విలేకరులకు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించనున్న ఈ ప్రచారంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



విస్సన్నపేట: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ అధికారి బి.నానిక అన్నారు.అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించి బ్రోచర్లను పంపిణీ చేశారు.

బడుగువర్గాల ఆశాకిరణం జగనన్న

మునునూరు: సామాజిక న్యాయం, సమానత్వం తనతోనే సాధ్యమని నిరూపించిన ధీరుడు ముఖ్యమంత్రి జగనన్న అని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు వెంకట నాగ వేణు గోపాల అప్పారావు(చంటినాయన) అన్నారు. ఆదివారం రాత్రి మునునూరులో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులంతా పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రేగుల గోపాలకృష్ణ, తులిమెల్లి సుబ్బారావు, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ కోడు అనిల్, సీనియర్ నేతలు లోకేశ్వరరావు, దేవేంద్రనాథ్, మానికల గంగాధర్, జయరాజు, బాబూరావు, సురేష్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ

నూజివీడు: పురపాలక సంఘాల్లో పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆఫర్ ఇచ్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఈ నెల 30 లోగా ముందస్తుగా చెల్లిస్తే అందులో ఐదు శాతం పన్ను రాయితీ యజమానులకు లభించనుందని సోమవారం మున్సిపాలిటీ అధికారులు విలేకరులకు తెలిపారు. నూజివీడు పురపాలక సంఘం ఆస్తి పన్ను డిమాండ్ దాదాపు రూ.5 కోట్లు ఉందని, పట్టణ పరిధిలో దాదాపు 12 వేలకు పైగా ఎసెస్‌మెంట్లు ఉన్నాయని వివరించారు. గతేడాది బకాయిలు ఉన్న వారు వాటిని కూడా ఇప్పుడు చెల్లిస్తేనే రాయితీ వర్తించనుందని స్పష్టం చేశారు.

జగనన్నకు అండగా నిలుస్తాం

- తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు
- గుడివాడ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

తిరువూరు: ఎన్నికల సమరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడితే సహించేది లేదని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గుడివాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సిద్ధం సభకు తరలివెళ్లేందుకు సోమవారం తిరువూరు నియోజకవర్గం నుంచి ఏర్పాటు చేసిన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై విజయవాడలో దాడి ఘటన జరిగిన తర్వాత ఆయనకు అండగా నిలుస్తామంటూ కార్యకర్తలు అధికసంఖ్యలో తరలి వస్తున్నారన్నారు. తిరువూరు నియోజకవర్గం నుంచి 110 బస్సుల్లో అభిమానులు, కార్యకర్తలు గుడివాడ సిద్ధం సభకు తరలివెళ్లారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో సిద్ధం సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.



తిరువూరు నుంచి గుడివాడ సిద్ధం సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న స్వామిదాసు



పెనుగొలను నుంచి గుడివాడకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుడివాడకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గంపలగూడెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడివాడలో సోమవారం నిర్వహించిన మేమంతా సిద్ధం కార్యక్రమంలో పాల్గొనేందుకు గంపలగూడెం మండల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 40 ప్రత్యేక బస్సులు, కార్లలో వారు వెళ్లారు. రెండురోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దాడి జరిగిన నేపథ్యంలో తమ నేతను కళ్లారా చూసి, మద్దతు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివెళ్లారు. ఈ నేపథ్యంలో మండలంలో ఒక పండుగ వాతావరణం కనిపించింది.

విస్సన్నపేటలో...

విస్సన్నపేట: గుడివాడలో మేమంతా సిద్ధం సభకు సోమవారం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని 12 గ్రామాల నుంచి 20 బస్సులలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు.

టీడీపీ నుంచి కీలక నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పాలంకి విజయలక్ష్మి, సురేష్ దంపతులు, వెంకటరమణ

రెడ్డిగూడెం: మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పాలంకి విజయలక్ష్మి, సురేష్ దంపతులు, టీడీపీ నాయకుడు తొర్లికొండ వెంకటరమణ సోమవారం కేసరపల్లి శిబిరం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు హర్షారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలులో జాగ్రత్తలు పాటించాలి

తిరువూరు ఆర్డీవో మాధవి

తిరువూరు: ఈ నెల 18 నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానున్నందున పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో నిబంధనలు పాటించాలని తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మాధవి సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేయదలచిన అభ్యర్థులకు నామినేషన్ల ప్రక్రియపై ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. నామినేషన్ పత్రాలను నింపడంలో తప్పులు దొర్లరాదని, కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉన్న పత్రాలను తిరస్కరిస్తామని తెలిపారు. పోటీలో ఉండే అభ్యర్థి ప్రతిపాదకులు, బలపరచేవారు ఆర్‌వో కార్యాలయంలో హాజరు కావాలని, నామినేషన్ పత్రాలతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు జత చేయాలన్నారు. అభ్యర్థిపై ఉన్న కేసుల వివరాలు, ఆస్తిపాస్తులను తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వానికి ఏదైనా పన్నులు లేదా ఇతర చెల్లింపులు బకాయి వున్నవారి నామినేషన్లు తిరస్కరిస్తామన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీ వారైతే వారికి ఆయా పార్టీల గుర్తులు ఇస్తామని, ఇతరులు తమకు కావలసిన గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో తెలియజేయాల్సి ఉంటుందన్నారు. వివిధ నిబంధనలతో కూడిన బుక్‌లెట్‌లను అభ్యర్థులకు, ప్రతినిధులకు పంపిణీ చేశారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.



తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ల దాఖలుపై సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి మాధవి

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాలకృష్ణ మృతి




బాలకృష్ణ(ఫైల్)

తిరువూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రంగస్థల కళాకారుడు టీకే బాలకృష్ణ (65) సోమవారం గుండెపోటుకు గురై మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు. వైఎస్సార్ సీపీ స్థాపించిన నాటి నుంచి తిరువూరు పట్టణంలో క్రియాశీలక కార్యకర్తగా ఉంటున్న బాలకృష్ణ కొద్దికాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతికి తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

హత్యాయత్నంపై పెల్లుబికిన ప్రజాగ్రహం

ఇబ్రహీంపట్నం: పేదలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విజయవాడలో జరిగిన హత్యాయత్నంపై మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజాగ్రహం పెల్లుబికింది. వివిధ గ్రామాల్లో ప్రజలు సీఎంపై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. కొండపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గుంటుపల్లిలో దాడికి నిరసనగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ కోనూరు వెంకటేష్, వైఎస్సార్ సీపీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారనే భయంతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రోత్సాహంతో పచ్చమూకలు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం జగన్‌పై దాడికి నిరసనగా గుంటుపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎం జగన్‌పై దాడి పిరికిపందల చర్య

ఇబ్రహీంపట్నం: విజయవాడలో మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దాడి చేయడం పిరికిపందల చర్య అని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ఇబ్రహీంపట్నంలో సోమవారం ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. ఓడిపోతామనే భయంతోనే టీడీపీ ఈ ఉన్మాదానికి ఒడికట్టిందన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ప్రత్యేకమైన ఆయుధంతో హత్య చేసేందుకు ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం జగన్ పెద్ద ప్రమాదం లేకుండా బయటపడటం దేవుని దయ, ప్రజల దీవెనల వల్లే అన్నారు. కుట్రదారులు ఏ కలుగులో దాగి ఉన్నా పోలీసులు ఛేదించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా అమ్మాజాన్ ఉరుసు గంధ మహోత్సవం

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో అలుపెరగని అన్నదాత సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరిబాబా వారి ధర్మపత్ని మొహమ్మద్ ఖైరున్నిసా బేగం అమ్మ జాన్ మహోత్సవాలు గత మూడు రోజుల నుంచి దర్బార్ పీఠాధిపతి సజ్జదా నషీన్ మొహమ్మద్ ఖాజా మొహీయుద్దీన్ షా తాజ్ ఖాదరి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన భక్తి శ్రద్ధలతో ప్రారంభమైన ఈ ఉరుసు మహోత్సవం దివ్య ఖురాన్ పారాయణం, మహాదివ్య అన్న సమారాధన, 14న దివ్య ఖురాన్ పారాయణం ఉరుసు సందల్ సమర్పణ, సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి శాశ్వత దివ్య విశ్రాంత మందిరంలో పవిత్ర పుష్పాంజలి, పవిత్ర చాదర్ సమర్పణ, సుగంధ సందల్ ఊరేగింపు, పుష్పాంజలి పవిత్ర పతాక ప్రతిష్ఠాపనం, 15న అమ్మజాన్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు ముగింపు మహోత్సవం కార్యక్రమాలు మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ ఉరుసు మహోత్సవంలో భారతదేశ నలుమూలల నుంచి వచ్చిన బాబా వారి భక్తులకు కులమత వర్గ విచక్షణ లేకుండా వేలాది మందికి మహా దివ్య అన్న సమారాధన కార్యక్రమాలు గత మూడు రోజులుగా నిర్వహించారు. అమ్మజాన్ దర్గాను భక్తులు దర్శించి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విజయనగరం దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్‌బాబు, మొహమ్మద్ గులాం జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మజాన్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతులు

మరో 243 మంది వలంటీర్ల రాజీనామా

మునునూరు: ప్రతిపక్షాలకు చెందిన చోటా మోటా నేతలు, కార్యకర్తల నోటి దురుసు భరించలేక తాము రాజీనామాలు చేస్తున్నట్లు గ్రామ వలంటీర్లు ప్రకటించారు. కాట్రేనిపాడు, వేల్పుచర్ల, సూరేపల్లి తదితర గ్రామాలకు చెందిన 54 మంది గ్రామ వలంటీర్లు సోమవారం మధ్యాహ్నం ఎంపీడీఓ బాగంటి పద్మావతీ దేవికి తమ రాజీనామా పత్రాలు అందజేశారు. దీంతో మండలంలో 299 మంది వలంటీర్లలో సోమవారం సాయంత్రానికి 260 మంది రాజీనామా పత్రాలు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలో సోమవారం ఆగిరిపల్లి, ఈదర, సీతారాంపురం, కనసానపల్లి, చొప్పరమెట్ల, కల్లుటూరు, వడ్లమాను, కృష్ణవరం గ్రామాల్లో 80 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేసి పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

రెడ్డిగూడెంలో...

రెడ్డిగూడెం: మండలంలోని నాగులూరు గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న 8 మంది సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఆశీర్వాదంకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తాము ప్రజలకు సేవ చేస్తుంటే రాజకీయ పార్టీల నాయకులు నిందలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేసేందుకు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నట్లు వారు తెలిపారు.

- విస్సన్నపేట: మండలంలోని పుట్రేల సచివాలయం-2 పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 24 మంది గ్రామ వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.విజయకుమారికి రాజీనామా పత్రాలు సమర్పించారు.
- చాట్రాయి: మండలంలోని పోలవరం, తుమ్మగూడెం,మర్లపాలెం, చీపురుగూడెం, కొత్తగూడెం, పర్వతాపురం గ్రామాల్లోని 77 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఎంపీడీఓ మంగాకుమారికి తమ రాజీనామా పత్రాలు అందజేశారు.

రూ.94 వేల నగదు స్వాధీనం

తిరువూరు: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిమితికి మించి నగదు తీసుకెళుతున్న ఒక వ్యక్తి నుంచి తిరువూరు పోలీసులు సోమవారం రూ.94,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. తిరువూరు సమీకృత చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడ గొల్లపూడికి చెందిన ఒక వ్యక్తి వద్ద పరిమితికి మించి నగదు ఉన్నట్లు గుర్తించిన ఎస్ఐ సత్యనారాయణ ఆ నగదును స్వాధీనపరచుకున్నారు. సరైన ఆధారాలు చూపనందున నగదు సీజ్ చేసి రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

నూజివీడు: శ్రీరామనవమిని పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి నూజివీడు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు నూజివీడు డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని, మరింత సమాచారం కోసం 99592 25461, 73828 93197, 73829 25467కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్వ్యూలు

నూజివీడు: వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యాన పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. గోద్రెజ్ ఆగ్రోటెక్ కంపెనీ ప్రతినిధులు ఉదయం 10 గంటల నుంచి రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ప్లేస్‌మెంట్స్‌కు రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ, ఏడు ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు హాజరవుతారన్నారు.

కోదండ రామాలయంలో అధ్యయనోత్సవాలు

తిరువూరు: శ్రీరామనవమి సందర్భంగా తిరువూరు శ్రీకోదండ రామాలయంలో సోమవారం అధ్యయనోత్సవం నిర్వహించారు. సీతారామచంద్రస్వామికి విశేషపూజలు, సమ్మాళ్వార్లకు పరమపదోత్సవం తదితర కార్యక్రమాలను అర్చకులు విఠలాచార్యులు, పార్థసారథాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. వేదశాత్తుమొరై కార్యక్రమంలో అధ్యయనోత్సవాన్ని ముగించారు. 17న సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు సోమవరపు వీరయ్య, సత్యనారాయణ తెలిపారు.